క్లుప్తంగా

వారికి సెలవు దినమే.. పని దినం!



మట్టిని తరలిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: మట్టి అక్రమార్కులకు సెలవు దినమే పని దినంగా మారిపోయింది. ఆదివారం సెలవు దినం కావడంతో అధికారులు ఉండరనే ధీమాతో మట్టిని యథేచ్ఛగా తరలించేస్తున్నారు. కూటమి నేతలు కొండలు, గుట్టలను కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. గొందిపల్లి రెవెన్యూ పొలం నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ.1500లతో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మ్యానువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

చిలమత్తూరు: ప్రాథమిక పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయులకు మ్యానువల్‌గా బదిలీలు నిర్వహించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. హిందూపురం ఉపాధ్యాయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో హిందూపురం మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి గంగప్పకు వినతి పత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయుడు అంజనమూర్తి మాట్లాడుతూ కమిషనర్ ఇచ్చిన హామీ మేరకు మ్యానువల్‌గానే బదిలీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, నారాయణస్వామి, గురురాజారావు, సలీం భాష, షామీర్ భాష, మధుసూదన్ రెడ్డి, గోపాల్ నాయక్, మోహన్ కుమార్. ఆంజనేయులు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ.13 కోట్లతో కుష్టు రోగులకు చికిత్స



కుష్టు రోగులతో స్వామి జపానంద

పావగడ: 650 మంది కుష్టు రోగుల చికిత్సకు రూ.13 కోట్ల వ్యయం అయిందని స్వామి జపానంద తెలిపారు. స్థానిక స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో గత 3 నెలలుగా చికిత్స పొందుతూ.. ఆరోగ్యం కుదుటపడిన 5 మంది కుష్టు బాధితులతో స్వామి జపానంద మాట్లాడారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 సంవత్సరాలుగా కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి అనేక మంది కుష్టు రోగులు ఇక్కడికి వచ్చి చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారికి ఔషధాలతో పాటు అవసరమైన పరికరాలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు డా.చంద్రకళ, డా.ప్రమోద్ తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


నష్టపరిహారం చెక్కు అందజేత



శివయ్యకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ: తాలూకాలోని ఆర్.అచ్చమ్మనహళ్లి గ్రామ శివారులో ఇటీవల ఓ ప్రైవేట్ సోలార్ కంపెనీ నిర్మాణం కోసం గుట్టల తొలగింపు పనుల్లో భాగంగా జిలిటిన్ స్టిక్స్ పేలడంతో కార్మికుడు శివయ్య గాయపడ్డాడు. కంటిని కోల్పోయిన సంగతి పాఠకులకు విదితమే. ఆదివారం నష్ట పరిహారం కింద కంపెనీ చెల్లించిన రూ.5 లక్షల చెక్కును కార్మికుడు శివయ్యకు ఎమ్మెల్యే వెంకటేష్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వెంకటరమణప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో పాడి ఆవు మృతి



మృతి చెందిన ఆవు

హిందూపురం: మండలంలోని మిట్ట మీదపల్లిలో రైతు సురేష్‌కు చెందిన పాడి ఆవు ఆదివారం 11 కేవీ విద్యుత్ వైర్ తగిలి మృతిచెందింది. ఉదయం ఆవు గ్రామ సమీపంలో గడ్డి మేస్తుండగా తెగి కిందపడి ఉన్న కరెంట్ వైరు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు మృతి చెందటంతో రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఆవు మృతి చెందిందన్నాడు.

భయం.. భయం

- ప్రమాదకరంగా విద్యుత్ తీగలు
- చేతికి అందే ఎత్తులో వేలాడుతున్న వైనం
- తీగల ఎత్తు పెంచాలని అధికారులకు మొర
- పట్టించుకోని విద్యుత్ అధికారులు
- భయాందోళనకు గురవుతున్న గ్రామీణులు



టీడీ పల్లిలో ఓ ఇంటిపై లాగిన 11 కేవీ విద్యుత్ లైన్

రొళ్ల: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఇళ్లపై చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకోవడంతో కూలిపోయే ప్రమాదం ఉంది. 1982–86 మధ్య కాలంలో మండలానికి కరెంట్ సరఫరా ప్రారంభించారు. విద్యుత్ స్తంభాలు నాటి గృహాలు, వ్యవసాయ బోరుబావులకు త్రీఫేస్‌తో పాటు 11 కేవీ లైన్ల ద్వారా వివిధ గ్రామాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. చాలా ఏళ్ల గడవడంతో విద్యుత్ స్తంభాలు పెచ్చులూడాయి. అందులో అమర్చిన ఇనుప కడ్డీలు తేలాయి. విద్యుత్ తీగలు వేలాడుతూ గాలీవానకు కూలిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. మండలంలో రొళ్ల, బీజీ హళ్లి, రత్నగిరి విద్యుత్ సబ్ స్టేషన్ ద్వారా నుంచి పది పంచాయతీల పరిధిలోని వివిధ గ్రామాలు, వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ లైన్లను లాగారు. టీడీ పల్లి గ్రామ సమీపంలో ఇందిరమ్మ కాలనీ గుండా వ్యవసాయ పొలాలకు లాగిన 11 కేవీ విద్యుత్ లైన్ చేతికి అందే ఎత్తులో వేలాడుతోంది. ఇటీవల మండల వ్యాప్తంగా లోఓల్టేజీ సమస్యను పరిష్కరించే దిశగా సర్వీసులు ఉన్న ప్రతి బోరు బావి వద్ద హై ఓల్టేజీ డిస్ట్రిబ్యూషన్ సిస్టం (హెచ్‌వీడీఎస్) ద్వారా 16, 25 కేవీ సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. పాత విద్యుత్ స్తంభాలు, ఇనుప తీగలు తేలిన వాటిని తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదు. ఇది వరకే లాగిన పాత స్తంభాల గుండా వైర్లను లాగారని రైతులు చెబుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

చేతికి అందే ఎత్తులో తీగలు



వ్యవసాయ పొలం గుండా ఇందిరమ్మ కాలనీ సమీపంలో బోరుబావులకు లాగిన 11 కేవీ విద్యుత్ లైన్లు చేతికి అందే ఎత్తులో వేలాడుతున్నాయి. పొలాల వద్దకు వెళ్లేటప్పుడు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అంతే సంగతులు. అదేవిధంగా ఇందిరమ్మ కాలనీలో గిరిజమ్మ అనే మహిళ ఇంటిపై భాగంలో 11 కేవీ లైన్ ఉంది. ఇంటి పైకప్పు ఎక్కితే ప్రమాదం జరిగే చోటుచేసుకునే అవకాశం ఉంది. విద్యుత్ లైన్ల ఎత్తును పెంచాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకుని వేలాడుతున్న విద్యుత్ తీగల ఎత్తును పెంచాలి.

– రామప్ప, టీడీ పల్లి గ్రామం

ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలి



గ్రామ మధ్యలో ఏర్పాటు చేసిన రెండు సింగిల్ ఫేస్ 16 కేవీ సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటికి మార్చాలి. ప్రస్తుతం ఇంటి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. తరచుగా వైర్లు ఒకదానికి మరొకటి రాసుకుని అగ్నికీలలు పడుతుంటాయి. గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామం మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను మరోచోటికి మార్చాలని అధికారులకు విన్నవించాం. ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకుని ట్రాన్స్ ఫార్మర్లను వేరే చోటికి మార్చాలి.

– తిమ్మారెడ్డి, హెచ్‌టీ హళ్లి గ్రామం

చర్యలు తీసుకుంటాం..

విద్యుత్ లైన్లు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను మార్చేందుకు ప్రస్తుతం నిధులు లేవు. నిధుల కొరత ఉండటంతో పనులు చేయించ లేదు. నిధుల కేటాయింపు కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే వివిధ గ్రామాల్లో పాత విద్యుత్ స్తంభాలతో పాటు కిందకు వేలాడుతున్న తీగలను సరి చేయిస్తాం. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– నిజాముద్దీన్, విద్యుత్ ఏఈ, రొళ్ల

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న మండల కన్వీనర్ రామిరెడ్డి

మడకశిరరూరల్: గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మండల కన్వీనర్ రామిరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగా రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం చందకచెర్లు పంచాయతీలోని ఎగువ అచ్చంపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది కావస్తున్నా హామీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఖరీఫ్ పంటల సాగుకు రైతులకు వెంటనే సబ్సిడీ విత్తనాలు అందించాలన్నారు. హామీల అమలుకు ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రనాయక్ కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, ఎంపీటీసీ గోపాల్ నాయక్, యువజన విభాగాల అధ్యక్షులు శేషాద్రి, నాయకులు నారాయణ స్వామి, రుద్రప్ప, దివాకర్, మల్లేశప్ప, రంగనాథ్, దాసన్న, మంజు, గిరిధర్, విజయ కుమార్, కాలే నాయక్, తిప్పన్న, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త మాధవి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త మల్లికార్జున

చిలమత్తూరు: సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి శాస్త్రవేత్త డా. త్రికల మాధవి, ఐసీఏఆర్ శాస్త్రవేత్త డా. దురై మురగన్ సూచించారు. ఆదివారం చిలమత్తూరు, కొడికొండ రైతు సేవా కేంద్రాల్లో వికశిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరైన వీరు రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయంలో అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు, పురుగు మందులకు స్వస్తి పలకాలన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా పంటలను పండించి మెరుగైన దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో మడకశిర పశు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. శివకుమార్, మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ, పశువైద్యాధికారి పురుషోత్తమరెడ్డి, ఉద్యానశాఖ అధికారి మహేష్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

అమరాపురం: వ్యవసాయంలో రైతులు నూతన పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మల్లికార్జున పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాలుగు గ్రామాల కూడలిలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం ద్వారా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ రంగంలో అధిక మోతాదులో ఉపయోగించే మందులు, ఎరువులకు స్వస్తి పలకాలన్నారు. పంటల సాగులో వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నూతన పద్ధతులు, వంగడాలు, డ్రోన్ స్ప్రేయింగ్ తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులు పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విత్తనాలు, ఎరువులు, తక్కువ మందులు వాడకం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరిజసదానందగౌడ, ఏఓ మంజునాథ, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగా సాధన చేస్తున్న ఎంపీపీ ఈరన్న, అధికారులు

అమరాపురం: హేమావతిలోని సిద్ధేశ్వస్వామి ఆలయ ఆవరణలో తహసీల్దార్ లక్ష్మీ నరసింహ, ఎంపీడీఓ రామరావు ఆధ్వర్యంలో ఆదివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు కిశోర్, నాగభూషణ తదితరులు యోగాసనాలు చేయించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు యోగా సాధన చేయాలన్నారు. యోగా చేయడం ద్వారా మానసిక ఉల్లాసం, మానసిక ప్రశాంతత, పని ఒత్తిడి తగ్గుతుందన్నారు. అదేవిధంగా ఎలాంటి రోగాలు దరిచేరవని తెలిపారు. దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రజలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మడకశిరలో యోగాంధ్ర

మడకశిర: పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఆదివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వివిధ వర్గాల ప్రజలు, పట్టణ ప్రముఖులు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, పోలీసులు యోగా సాధన చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, స్పెషల్ ఆఫీసర్ క్రిష్ణానాయక్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్లు, సీఐలు నగేష్, రాజ్‌కుమార్, తహసీల్దార్ కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఎంపీడీఓ సోనిబాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'యోగాంధ్ర'పై నేడు ర్యాలీ

లేపాక్షి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 10న లేపాక్షిలో నిర్వహించే జిల్లా స్థాయి యోగా కార్యక్రమం సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తామని ఎంపీడీఓ నరసింహమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 8 .30 నుంచి 9.30 గలటల మధ్య జవహర్ నవోదయ విద్యాలయం నుంచి నంది విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నవోదయ విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, యోగా అభ్యాసకులు, ప్రజలు పాల్గొంటారన్నారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఉప్పార్లపల్లి శివన్న

అమరాపురం: రామగిరి మండలం ఏడు గుర్రాలపల్లిలో ఓ దళిత మైనర్ బాలికపై అత్యాచారం చేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఉప్పార్లపల్లి శివన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. అత్యాచార ఘటనలను కుల మతాలకు అతీతంగా యావత్తు సమాజం ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్ట పరిధిలో నిందితులకు మరణ శిక్ష విధించాలని కోరారు. ఎలాంటి ఆదరణ లేని బాలికపై అత్యాచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దుండగులపై పోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలన్నారు.

శిథిలావస్థలో డ్వాక్రా భవనం



పెనుకొండ పట్టణంలోని డ్వాక్రా భవనం



పెచ్చులూడిన భవనం పైకప్పు

పెనుకొండ: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డ్వాక్రా భవనం శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. 2000లో భవనాన్ని నిర్మించారు. ఇందులో డ్వాక్రా మహిళల సమావేశాలు నిర్వహిస్తుంటారు. నిర్వహణ లేకపోవడంతో గదులు శిథిలమై కూలడానికి సిద్ధంగా ఏన్నాయి. చిన్న వర్షానికే గదులు మొత్తం నీటితో నిండిపోతున్నాయి. ప్రస్తుతం భవనాల్లో పలు వ్యాపార సముదాయాలతో పాటు డ్వాక్రా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అధికారులు స్పందించి భవనానికి మరమ్మతు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇంటికి వేసిన తాళాల తొలగింపు



ఇంటికి తాళాలు తొలగించిన పోలీసులు

హిందూపురం: అప్పు తీర్చలేదని బాధితురాలి ఇంటికి వేసిన తాళాలను పోలీసులు తొలగించారు. అప్పలకుంటలో నివాసముంటున్న హనుమప్ప అప్పు తీసుకున్నట్లు ఎలాంటి ఆధారం లేకపోయినా, అతను మరణించి ఐదేళ్లయినా డబ్బులివ్వాంటూ అతని భార్య, కుటుంబాన్ని అదే గ్రామానికి చెందిన అంజక్క ఆమె కుమారుడు సుధాకర్ ఒత్తిడి జేస్తూ శనివారం వారిని బయటకు గెంటేసి ఇంటికి తాళాలు వేశారు. దీంతో ఇంటి బయటే బాధిత గంగమ్మ కుటుంబంతో బైఠాయించింది. ఈ విషయంగా బాధిత కుటుంబం హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎట్టకేలకు పోలీసులు స్పందించారు. హిందూపురం రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్‌సీఐ ఆంజనేయులు ప్రత్యేక చొరవ చూపి సమస్యకు పరిష్కారం చూపుతూ పోలీసులను గ్రామానికి పంపించారు. పోలీసులు గ్రామస్తుల సమక్షంలో గంగమ్మ ఇంటికి వేసిన తాళాలు తొలగించి ఆమె కుటుంబాన్ని ఇంటిలోకి చేర్చారు. మళ్లీ గొడవకు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని చర్యలు తీసుకుంటామని బాధితురాలికి పోలీసులు సూచించారు.

నరసింహ భట్టాచార్యులకు నివాళి



నరసింహ భట్టాచార్యులు మృతదేహం వద్ద నివాళులర్పించిన మాజీ మంత్రి రఘువీరారెడ్డి

అమరాపురం: మండల కేంద్రానికి చెందిన ప్రధాన అర్చకుడు నరసింహ భట్టాచార్యులు మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి ఆదివారం నరసింహ భట్టాచార్యులు మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మంచి అర్చకుడిని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. నీలకంఠాపురంలో నిర్మించిన దేవాలయాల్లో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠాపన పూజలు తదితర వాటిని నరసింహ భట్టాచార్యులు నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే సుధాకర, ఎం .ఈరన్న తదితరులు నివాళులర్పించారు. పలువురు ఆర్యవైశ్య సంఘం సభ్యులు మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా నరసింహ భట్టాచార్యులు పూజలు చేశారని గుర్తు చేసుకున్నారు. మైసూరు, పావగడ, నిడగల్లు, వదనకలు, తమిళనాడు నుంచి బంధువులు స్నేహితులు పెద్ద సంఖ్యలో వచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుమారులు హరీష్, నరేష్‌ను పలువురు పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

తాగునీటి పథకం కార్మికుల వేతనాలు చెల్లించండి



నిరసన తెలుపుతున్న కార్మికులు

చిలమత్తూరు: హిందూపురం పురపాలక సంఘంలోని గొల్లపల్లి రిజర్వాయర్ వాటర్ వర్క్స్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం వెంకటాపురం తండాలోని పంప్‌హౌస్ వద్ద కార్మికులతో సమావేశమై ఆయన మాట్లాడారు. హిందూపురం పట్టణానికి నీళ్లు వదులుతున్న గొల్లపల్లి వాటర్ వర్కర్స్ నాలుగు పంప్ హౌస్‌లలో 25మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి ఏడు నెలలుగా జీతాలు అందలేదని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు లేవన్నారు. అలాగే ఈ 25 మంది కార్మికులకు మున్సిపాలిటి నుంచి జీతాలు చెల్లించాలని, ఆప్కాస్‌లో చేర్చాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, కార్మికులకు చట్టం ప్రకారం అన్ని సౌకర్యాలు వర్తింపజేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించకపోతే ఈ నెల 24 నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు నారాయణస్వామి, నాయకులు హరి, ఉమేష్, రాజు, ఆదినారాయణ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

గోరంట్ల: రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గోరంట్ల శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బాలిక అత్యాచారం ఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. నిందితులు ఏ రాజకీయ పార్టీ వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి విరాళం

లేపాక్షి: లేపాక్షి పంచాయతీ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గాదేవి ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి లేపాక్షికి చెందిన ఈడిగ రమేష్ రూ. 50 వేలు విరాళాన్ని ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు సన్మానించారు.

నేడు కౌన్సిల్ సమావేశం

పెనుకొండ: పట్టణంలోని నగర పంచాయతీ కౌన్సిల్ హాల్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫరూక్‌ఖాన్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నారు. ఈమేరకు నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకారం

మడకశిర: మడకశిర వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు మార్కెటింగ్‌శాఖ అధికారులు తెలిపారు. మార్కెట్‌యార్డు ఆవరణలో జరిగే ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ప్రజాప్రతినిధులు, మార్కెటింగ్‌శాఖ అధికారులు హాజరవుతారన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో ఆంజనేయుడు

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామంలో ఆదివారం ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. గతంలో ఉన్న ఆలయాన్ని తొలగించి ఇటీవల నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. పాత ఆలయంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహానికి పునః ప్రాణ ప్రతిష్టాపన చేసి, నూతనంగా నిర్మించిన గర్భగుడిలో ప్రతిష్టించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామికి వివిధ రకాల పూజలు చేశారు. అనంతరం మహా మంగళ హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, దర్మదర్శి రామకృష్ణారెడ్డి, కట్టిమనే గౌడలు, గొంచికార్ భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయాల ప్రారంభోత్సవం



పూజలందుకుంటున్న గ్రామ దేవతలు

పావగడ: తాలూకాలోని కడపలకెరె గ్రామంలో మారెమ్మ, కొల్లాపురమ్మ, దుర్గమ్మ గ్రామ దేవతల నూతన దేవాలయాల ప్రారంభోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అలాగే నూతన విగ్రహాలకు ప్రాణ ప్రతిష్టాపన చేశారు. ఆలయంలో ఉదయం శ్రీదేవి ప్రాణప్రతిష్టాపన, నేత్రోన్మీలన, ధేను దర్శనం, జ్వాలా దర్శనం, దర్పణ వీక్షణం, కూష్మాండ స్ఫోటన, నారికేళ స్ఫోటన, మహా దీప దర్శనం, దీక్షా హోమం, న్యాస హోమాలు, మూర్తి హోమం, బలి ప్రధాన, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం చేపట్టారు. ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకట రమణప్ప తదితర నాయకులు పాల్గొని దేవతలకు పూజలు చేయించారు.